

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## *బంగారు కలలు*

"**నీ సన్నటి వేళ్ళు** కీ బోర్డ్ మీద కదులుతూంటే, మెరుపు తీగలు డాన్స్ చేసినట్లుంటుంది తెలుసా? అది చూస్తూ నా పని మర్చిపోయి తిట్లు తింటున్నాను నీ మూలంగానే" నవ్వుతూ చెప్పాడు జయ్.

సమీర చిన్నగా నవ్వింది కానీ బదులు చెప్పలేదు. ఆఫీస్ కేంటిన్‌లో ఇద్దరూ ఓ మూలవున్న టేబుల్ ముందు కూర్చున్నారు. సమీర ఇంటినించి తెచ్చుకున్న బాక్స్‌లోని పులిహోర తింటూంటే, జయ్ కేంటిన్‌లో బిరియానీ తెచ్చుకున్నాడు.

"మీరా! రెండు నెలల్లో నా ప్రాజెక్ట్ కంప్లీట్ అవుతుంది. తర్వాత నన్ను స్వీడన్ పంపుతానని మా బాస్ ప్రామిస్ చేసాడు. అప్పుడు మీ ఇంటికొచ్చి మీ పేరెంట్స్‌తో మాట్లాడతాను. పెళ్ళిచేసుకుని వెళ్ళిపోదాం. నాకు నువ్వు నీకు నేను. ఆ గోల్డెన్ డేస్ కోసం ఎదురుచూస్తున్నాను" జయ్ ఉద్విగ్నంగా చెప్పాడు.

"మీ పేరెంట్స్ సంగతేంటి?" సమీర పులిహోరలోని ఎండుమిరపకాయని బాక్స్ మూతలో వేస్తూ అడిగింది.

"వాళ్ళు నేను పెళ్ళిచేసుకుంటే చాలని వెయిట్ చేస్తున్నారు. వాళ్ళు ఒప్పుకుంటారు" ఓ నిమిషం ఆగి అడిగాడు జయ్.

"రేపు నా బర్తడే సాటర్‌డే వచ్చింది. బయటకి వెళ్దామా?"

"అమ్మతో నో ప్రాబ్లం జై. మా నాన్నకి ఏం చెప్పాలో" సమీర సందిగ్ధంగా చెప్పింది.

"ఏదో ఒకటి చెప్పు మీరా. ప్లీజ్‌ప్లీజ్. మనిద్దరం రేపు ఈవెనింగ్ డిన్నర్‌కి వెళ్దాం. నీకు కుదరకపోతే అసలు సెలబ్రేట్ చేసుకోను" జయ్ నిరాశగా చెప్పాడు.

అతనికి తనమీదగల ప్రేమకి సమీరకి సంతోషంగా అనిపించింది.

"వస్తాను జై. నాన్నకి ఏదో అబద్ధం చెప్పి తప్పకుండా వస్తాను" చెప్పింది.

"అమ్మా! రేపు ఒక ఫ్రెండ్ బర్తడే సాయంత్రం డిన్నర్‌కి వెళ్ళాలి. నాన్నకి ఏం చెప్పను?" ఆ సాయంత్రం తల్లిని అడిగింది.

"సాయంత్రమా? వచ్చేసరికి రాత్రవుతుందేమో పోనీ లంచ్‌కి పోకూడదూ?" మాలతి అయిష్టంగా అడిగింది.

"లేదమ్మా తను మధ్యాహ్నం వాళ్ళ పేరెంట్స్‌తో లంచ్‌కి వెళ్తోందట" సమీర అబద్ధమాడింది.

"సరే. నాన్నకి చెప్పి వెళ్ళు. త్వరగా రా. మరీ అర్ధరాత్రి చేయకు" మాలతి ఒప్పుకుంది.

మర్నాటి సాయంత్రం కలయిక గురించి, కేండిల్ లైట్ డిన్నర్ గురించి జయ్‌తో సగం రాత్రిదాకా మాట్లాడుతూనే ఉంది సమీర. ఆ మాటల్లో భవిష్యత్తు గురించిన వారి కలలు, కోరికలు, భయాలు కూడా ఉన్నాయి.

"వీకెండ్ అయినా పొద్దున్నే లేచావు ఏమిటి విశేషం?" డైనింగ్ టేబుల్ ముందు కూర్చుని పేపర్ చదువుతున్న భాస్కరావు కూతుర్ని అడిగాడు.

"నాన్నా సాయంత్రం మా ఆఫీస్ కొలీగ్ ఒకమ్మాయి బర్తడే పార్టీ. వెళ్ళనా? నైన్ కల్లా వచ్చేస్తాను" సమీర తండ్రి ఎదురుగా కూర్చుని అడిగింది.

"సాయంత్రం పార్టీకోసం పొద్దున ఏడింటికి లేచావా?" ఆయన ఆశ్చర్యంగా అడిగాడు.

"కాదు నాన్నా. మెలుకువ వచ్చేసింది. వెళ్ళమంటావా?" ఆశగా అడిగింది.

"వెళ్ళు కానీ త్వరగా వచ్చెయ్. రోజులు బాలేదు."

సమీర తన ఆనందం మొహంలో ప్రతిఫలించకుండా జాగ్రత్తపడుతూ కాఫీకోసం వంటగదిలోకి వెళ్ళింది.

మధ్యాహ్నం బ్యూటీపార్లర్‌కి వెళ్ళి మూడుగంటల తర్వాత తిరిగివచ్చింది. ఇంట్లో వాతావరణం వేడిగా వుంది. తల్లితండ్రులు ఎందుకో తీవ్రంగా వాదించుకుంటున్నారు. ఓ నిమిషం బాధపడినా, అది వాళ్ళకి సర్వసాధారణం కాబట్టి నిశ్శబ్ధంగా తన గదిలోకి వెళ్ళిపోయింది. అద్దం ముందు నుంచుని ఫేషియల్ చేసిన మొహాన్ని చూసుకుని మురిసిపోయేప్పుడు హఠాత్తుగా గుర్తొచ్చింది. తను ఏ డ్రెస్ వేసుకుని వెళ్ళాలి? తన డ్రెస్‌లన్నీ చూసింది. ఊహూ. అన్నీ జై చూసేసాడు. నిన్న ఆఫీస్ అయాక కొత్త డ్రెస్ కొనుక్కోవాల్సింది అనుకుంది.

మంచం చివర కూర్చుని ఏం చేయాలా అని ఆలోచించింది. అమ్మ చీర కట్టుకు వెళ్తే?

ఆ ఆలోచన సమీరకి నచ్చింది. అన్ని చీరలకి సరిపోయేలాంటి ప్రింటెడ్ బ్లౌజెస్ అరడజనుదాకా ఉన్నాయి సమీరకి.

మెల్లగా బయటకి వచ్చి చూసింది. తల్లి వంటగదిలో పని చేసుకుంటోంది. తండ్రి డ్రాయింగ్ రూంలో టి.వి చూస్తున్నాడు.

"అమ్మా!" మెల్లగా పిలిచింది.

"ఏమిటి?" మాలతి వెనక్కి తిరిగి చూడకుండా అడిగింది.

"నీ చీర తీసుకోవచ్చా?"

"బీరువాలో చూసుకో ఏది నచ్చితే అది తీసుకో" మాలతి చెప్పింది.

సమీర చప్పుడు కాకుండా తల్లి బీరువా తలుపు తెరిచి, నచ్చిన చీరకోసం వెదకసాగింది. కింది అరలోని చీరలు చూస్తూంటే చేతికి గరగరలాడుతూ ఓ కాగితం దొరికింది. ఆసక్తిగా దాన్ని తీసి చూసింది. పూర్వం తెల్లగా ఉండేదేమో కానీ ప్రస్తుతం గోధుమ రంగుకి తిరిగిన కాగితం అది. తెలుగులో రాసివున్నదాన్ని ఆసక్తిగా చదివింది.

ప్రియా!

కాలేజ్‌లో నువ్వు నావంక క్రీగంట కూడా చూడలేదు. ఈ నిరాశోపహతుడ్ని కరుణించవా ప్రియా? కాలేజ్ నించి ఇంటికి వెళ్ళేప్పుడు దూరమైనా నువ్వు కనిపిస్తావనే చిన్న ఆశతో మీ ఇంటి మీదుగా వస్తే మీ రాంబాబు బాబాయ్ దుర్మార్గుడు అరుగుమీదే ఉంటాడు. నా వంకే చూస్తూ, సైకిల్ కొద్దిగా స్లో చేస్తే చాలు. కోపంతో అరుస్తాడు.

నువ్వేమో సన్నజాజి మొగ్గలు కోసే నెపంతో జాజిపందిరి కిందకి చేరతావు. నీ కుసుమ కోమలమైన వేళ్ళు జాజిమొగ్గలని వెదికి తుంచుతూంటే, నీ కళ్ళేమో, గోడమీంచి రోడ్డుమీదకి చుస్తూంటాయి. మా మంచి కళ్ళు మోసం చేయవు. నన్ను చూడగానే ఆనందంతో చిన్నవవుతాయి. అసంకల్పితంగా వేళ్ళు ఆకులని కోస్తాయి. చిరునవ్వుకి చిహ్నంగా బుగ్గమీద చిన్న సొట్ట పడుతుంది. జన్మధన్యమైందనుకుని సైకిల్ వేగంగా తొక్కుకుంటూ వెళ్ళిపోతాను.

ఇంకెంతకాలంలే మాలా! ఇంకో ఏడాదితో నా బికామ్ పూర్తవుతుంది. బేంక్‌లో ఉద్యోగం సంపాదిస్తాను. అరుగుమీది రాంబాబు బాబాయ్‌ని నిర్లక్ష్యంగా చూసుకుంటూ మీ ఇంట్లోకి నిర్భయంగా వస్తాను. మీ నాన్నతో మాట్లాడి ఒప్పిస్తాను. ఆ తర్వాత మనకన్నీ పౌర్ణమి రోజులే. మల్లెలు, జాజుల రాత్రులే! నా మాలతీ! ఆ బంగారు రోజులగురించి తలచుకుంటే 'రోజుకి మరీ ఇరవైనాలుగ్గంటలేంటి? నాలుగ్గంటలే ఉండచ్చుగా' అనిపిస్తోంది.

నువ్వు నేను కలిసి గడిపే ఆ మధుర సంవత్సరాల కోసం ఎదురు చూస్తూ,

*నీ చూపులకి చిక్కిపోయిన భాస్కర్.*

కింద హృదయపు బొమ్మ.

సమీర నిశ్చేష్టురాలై ఆ ప్రేమలేఖ వంక చుస్తూండిపోయింది.

"నీ వెతుకులాట ఇంకా పూర్తవలేదా? ఐనా పెద్దవాళ్ళ చీరలు నీకేం బావుంటాయిలే" మాలతి గదిలోకి వస్తూ చెప్పింది.

ఉత్తరాన్ని చటుక్కున యథాస్థానంలో పెట్టి సమీర లేచి బీరువా తలుపు వేస్తూ చెప్పింది.

"అవునమ్మా. ఏమీ నచ్చలేదు."

ఆమె దృష్టి తల్లి మోహం మీద పడింది. కళ్ళు ఏడ్చినట్లుగా ఎర్రగా ఉబ్బి ఉన్నాయి. ఎడమ చెంపమీద చేతి గుర్తులు స్పష్టంగా కనబడుతున్నాయి. ఆమె కలలో నడుస్తున్నట్లుగా తన గదిలోకి వెళ్ళిపోయింది. తెప్పరిల్లాక అరగంట తర్వాత జయ్‌కి మెసేజ్ ఇచ్చింది.

'నీ ప్రేమని అంగీకరించలేకపోతున్నాను. సారీ'

తర్వాత తల్లితో చెప్పింది.

"తలనొప్పిగా ఉందమ్మా. పార్టీకి వెళ్ళడం లేదు. నాకూ అన్నం వండెయ్"

Click here to share your comments

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*